# కోడి కూసింది

''కొక్కొరోకో...కోడికూసింది—

అది కోడి కూతలా లేదు - సింహగర్జనలా వుంది — ఠకీమని మెలకువొచ్చింది పుల్లయ్యకు—కాళ్ళు చాపాడు— జువ్వ్‌మని గుంజుతున్నాయి. ఒళ్ళంతా నొప్పులు—బలవంతంగా ముసుగు తొలగించాడు— కోడి కూసింది .. అంటే —తెల్లవారబోతుంది. అంటే-పనికెళ్ళాలి. ఒళ్లు హూనం చేసుకోవాలి. పని ..పని పని విరామమెరుగని పని. —పుట్టి బుద్దెరిగినప్పట్నుంచీ అంటే ఏడెనిమిదేళ్ల పాలుగారే పసివయస్సునుంచీ పాలేరుగా జీవితం గడుపుతున్నాడు— ప్రొద్దు పొడవకముందే లేవడం రాత్రియే వరకు యంత్రంలా పనిచేయడం—కాళ్లు క్రిందికి చాపి మంచంలో కూర్చున్నాడు పుల్లయ్య...

''పెయ్యంత పుండు- పుండోలె నొత్తంది— సాతనయితలేదు. ఇయ్యేల్ల పనికి వోకుంటే బాగుండు. కని పటేలూకుంటాడా ? మల్ల ఎద్దుకో నాగలిగట్టి వేసంగి మడికట్టు దుంతున్న యాల్లాయె. గిప్పుడస్సలే తీరది తెల్లారెదాక సెలుకల అకిటెడ్ల మేష్కరవాలె తెల్లారినంక నాగలి గట్టాలె ..గజ్జుగజ్జు అనుకతున్నా సల్లె నాగలిదున్నాలె. జానెడంత కడుపు కోసమెంత తిప్పల.. ? కోడికూసినంక లేత్తె రాత్రి ఇంటికచ్చుడాయె. గీ పాలేరు బతుకుతోని పొల్లగండ్ల సాదుకునుడే కట్టమవుతున్నా పన యితె తప్పపాయె... కోడిపాడుగాను జెప్పన్నె కూసే. నా మాటలుగని దాందేం తప్పుంది ? యాల్లయింది కూసింది... ఇంకొంచెం పంటె మంచిగుండు కని పంటెల్లుతాది'' తనలో తానే అనుకుంటూ అయిష్టంగానే లేచాడు. బీడంటు పెట్టుకున్నాడు. తలపైనుండి గొంగడి ముసుగేసుకున్నాడు బీడితాగుతూ పటేలు ఎడ్లకొట్టం దిక్కు నడిచాడు పుల్లయ్య.

పాలేరు పనిభూతం పుల్లయ్యకు కోడికూతను భయంకరం చేసింది.

"కొక్కొరొక్కో...." కోడికూసింది ..

ఆ కూత కర్ణకఠోరంగా వుంది బక్కయ్యకు. ఒళ్ళు విరుచుకున్నాడు. మంచంలో నుండి లేచి బయటకొచ్చాడు ... ఆకాశం దిక్కు చూసాడు.

"రాత్రి బాగానే ఉన్నట్టుంది—కోడేమో కూసింది. భయంలేని కోడి బజార్ల గుడ్డు పెట్టినట్టు యాల్ల పొల్ల లేకుండా కూత్తుందా ఏంది—?" అనుకుంటూ గోరుకొయ్యల చుక్కల దిక్కు చూసాడు. వంగున్నాయి. ఇగ జెప్పన్నే తెల్లారుతది — పొగమంచువడి సీకటోలనిపిత్తుంది కని బాగ రాత్రేం లేదు. సలిపెట్టనట్టె పాడుగాను" గొణుక్కున్నట్టే అనుకుంటూ ఇంట్లోకొచ్చి ముసుగుపెట్టుకొని మంచంలో పడుకున్నాడు.... ఎండలో ఎండుతూ వానలో నానుతూ... చల్లో గడ్డకట్టుకపోతూ తాను బ్రతుకుతున్న కూలి జీవితం అతని కళ్ళముందు కదిలింది. రోజూ తెల్లవారిందంటే శరీరం నుగ్గునుగ్గయ్యేలా చేసే పని గూర్చి అతని మనసు తల్లడిల్లుతుంది—

"నాగల్దుంతి—మోట గొడితి-బాయిల్దివ్వితి— బండిగొడితి - కట్టెలు గొడితి సెలుకల కావలుంటి-ఏ పన్దొరుకుతె ఆ పన్జేత్తి- ఎన్నడు రికాము న్నది లేపాయె కడుపునిండా కాయిపాయిగ దిన్నది లేపాయె పొట్టకెల్లుదే కష్టంగావట్టే రోగమచ్చినా, నొప్పచ్చినా మందు గొనుక్కుందామన్నా ఒక్క పైసన్న ఉండకపాయె. ఈ నడుమ కయికిల్లు (కూలిరేట్లు) కొంత మా పెరిగినయ్ కని దర లంతకంటెక్కొనె పెరిగె— కిల నూనెకు పద్దెనిమిది రూపాయలైనంక ఇగబతుకుడెట్ల ....?" బక్కయ్యలో ఎన్నో ఆలోచనలు—

"ఆలోసించుకుంట పంటె నోట్లె కత్తదా? లచ్చయ్య షావుకారి బాయ తవ్వుమని గుత్తకిచ్చిండు-కింద బండోలె గట్టిగుంది. — ఎంత

తవ్వినా తెగుతలేపాయె. పైసలెక్కో సెయ్యంమంటేనేమొ సెయ్యపాయె అందర్ని జమ సేసుకొని పోవాలె. పొద్దుగాల్నయితె పని మంచిగెదుగు తది ...కంటిమీన కునుకు పట్టిందో లేదో తెల్లారనేవట్టె'' అనుకుంటూ లేచి గడ్డపార భుజంపై పెట్టుకొని . ఇంకేం బంటన్నవు లేవలేవు... లేసి ఆకిలూడ్సలుకు జల్లు. నేం బాయి ఎవ్వ పోతన్న.. అని భార్యకు చెప్పి బయటకెళ్లాడు బక్కయ్య.

"కొక్కొరోకో''—''కోడి కూసింది''

అది ఉరుములా వినిపించింది లక్ష్మయ్య చెవులకు . ఉలిక్కిపడి లేచాడు పైనున్న షోలాపూర్ ఛద్దరును ప్రక్కకు జరిపాడు.

తెల్లవారుతుందంటే పనుల్లో లీనమవ్వాలి. ప్రొద్దున లేస్తేనే సైకిల్‌పై బట్టలమూట గట్టుకొని మైళ్లకొద్ది ఊరూరా తిరిగి అమ్మాలి. కాళ్లు తీపులు పెడుతున్నా, చేతులు నొప్పులు పెడుతున్నా తిరిగి బట్టల మ్మడం, ఎక్కడ వీలైతే అక్కడ ఏది దొరికితే అది తినడం. అలసి పోయి రాత్రి వరకు ఇంటికి చేరుకోవడం లక్ష్మయ్య దినచర్య- అయినా పొట్టగడవడం కష్టంగానే వుంది.

"తెల్లారెటట్టుంది. పది పన్నెండు కిలోమీటర్లున్న ఊరికి పొయ్యి నమారమ్ముకరావాలె-పొద్దుగాల్నె పొయ్యి తిరుగవట్రి బ్యారెగాల్లు— అందరికంటె ముందుగవోతె నాలుగైదమ్ముతయి. తిరిగమ్మెటోల్లు బాగ మందాయెవరకు అమ్ముడు కష్టంగావట్టె. ఈ బ్యారంల షావుకారిముల్లె షావుకారికి పోంగ బట్టపొట్టకెల్లుడెట్లా అయితంది, వేరే పనేమన్న సేసు కుందామంటే పని రాపాయె .. అబ్బబ్బ కాళ్లు గుంజవట్టె. రోజు గన్ని మైల్లు తొక్కన్నంటే మాటలా .. ? ఇనోరిజుల తీరుగిప్పుడు సాతనయిత లేదు—రక్తముడుగుతుంది. ఎంత సాతగాకున్నా పొల్లగాడెదిగెగాక పని తప్పుతాది —,, అనుకుంటూనే ఎంత ఆయాసంగా వున్నా లేచి ముఖం కడుక్కోవడానికి బావి దగ్గరికెళ్లాడు లక్ష్మయ్య.

పొద్దంతా పనిరాక్షసికి బలవుతున్నా కడుపు కూడా నింపుకోలేని బక్కయ్య, లక్ష్మయ్యలకు తెల్లవారడం భయంకరమైనదిగానే తోస్తుంది.

"కొక్కొరోకో —" కోడికూసింది.

జీవితమంతా నాగేటి చాళ్ళకే అంకితం చేస్తూ... బ్రతుకుతున్న సాయిరెడ్డికా కూతలో ఏ ప్రత్యేకతా వినపళ్ళేదు... రోజూ కోడికూస్తూనే వుంటుంది ఆ కూతవిని తెల్లారుతుందని అర్థం చేసుకొని పనిలో లీన మవడానికి ప్రయత్నిస్తాడు . ఆ కూత అతనికి మామూలుగానే అనిపించింది...

"అన్నెన్న కాళ్లు గుంజుతున్నయి" అని కాళ్ళను నిరర్థిదన్నాడు.... ఒళ్ళు విరుచుకున్నాడు ముసుగు తీసాడు.

"ఇంకొంచెంసేపు పంటె మంచిగుండు కని పొలం సక్కగ పారుత లేదు. ఓదిక్కు పారితె ఇంకో దిక్కెండుతుంది, సాలీసాలని నీళ్లు .. మొన్ననే నాటేసిన-మొక్కలేనుకు-టున్నయి. గిప్పుడెండిపోతె దుబ్బన్న రాదు — ఎడ్లగ్గూడ మాతెయ్యాలె పొద్దెక్కేదాక కుంటకొమ్ము పొలం పారిచ్చత్తి నంటె అటెనుక ఇంకో పొలంల నాగలి గట్టచ్చె నాఆసోంటి కాపుదనబోనికి పంటెల్లుతాది ! మాయన్న ఇచ్చిపెయిన ఐదారెకరాల భూములోని ఎవుసం సేసుడే సేసుడాయె— ఓసారి పండె. ఇంకోసారెండె పండినేడు దినుసుకు దరుండకపాయె అడ్డగోలు మిత్తికి పైసల్దెచ్చి పెట్టు వడి పెదితె పంటనోట్లె కచ్చేదాక నమ్మకం లేపాయె— ఎన్నోసార్ల నోటికాడి బుక్క కిందవడిపెయినట్టు కోతకచ్చిన పంటమీద గాలివానచ్చి రాళ్ళవానచ్చి పంటంత భూంపాలాయె... ఇంటొల్లమంత మట్లె మన్నె కట్టపడుతంటె పొట్టకు మా ఎల్లతుంది కని ఏం మిగిలింది లేపాయె— అలోసించుకుంట పంటె కడుపునిండుతాది", అనుకుంటూ లేచి పంచెకప్పు కొని భార్యతో "పదిమంది కయికిలోల్లను (కూలివాళ్ళను) పిలువియ్యాల్ల సేతుల పైసలు పెట్టంది రారు — జెప్పన పొయ్యి కయికిలేసిరా" అంటూ

బయటకెళ్ళాడు సాయిరెడ్డి— కయికిలోల్లు దొరుకుతారో దొరుకరో— పనంతెనుకకు పోవట్టె అనుకుంటూ ఎడ్ల గుడిసె దగ్గరకు చేరుకున్నాడు

కొంత స్వంత వ్యవసాయమున్న మధ్యతరగతి సాయిరెడ్డికి తెల్ల వారితే అతనికున్న సమస్యలతనికుండనే వున్నాయి—కొద్దికొద్దిగావున్న ఆర్థిక ఇబ్బందుల్తో పాటు పని రాక్షసి భయం తెల్లవారితే ఉండనేవుంది

"కొక్కొరోకో—" కోడికూసింది—

"కోడికూయనే కూసిందా? ఇక పరుగు మొదలు — నిర్లిప్తంగా అనుకుంటూ కళ్ళు నులుముకున్నాడు సగటు మనిషి బడిపంతులు .. ఆ కూత అతనికొంత ఆనందం కల్గించేదిగా తోచింది .. ఎందుకంటే తెల్లవారిత్తె రావాల్సిన ట్యూషన్ల డబ్బొస్తుంది...చిల్లర ఖాతాలవీ కట్ట వచ్చు—అయితే అంతకంటే పెద్దాపద ముందుంది— బాకీ తీర్చమని రావ్‌గారు నిలదీసి అడుగుతున్నాడు. అది తీర్చడానికి రేపే వాయిదా... బిడ్డ పెళ్ళికి తెచ్చిన అప్పు, ఘన గా చేయాలన్న పెద్దరికం కొరకు చేసిన అప్పు ఇంతింతై వటుడింతయై అన్నట్టు ఎనిమిదివేలు దాటింది వడ్డీకలుపుకొని—ఆ అప్పు తీర్చడానికెన్ని ఖర్చులు తగ్గించుకున్నా— ట్యూషన్లు చెబుతున్నా సరిపోవడం లేదు...దానికితోడు దినదినమూపెరిగే ధరలు— గొర్రెతోకలాంటి జీతం. గానుగెద్దులా రొటీను బ్రతుకు— అందరి ముందు అప్పు గూర్చి నిలదీసి అడిగిత్తే పరువు పోతుందేమోనని భయంగా ఉందతనికి గుండెల నిండా గుబులు - లేచి తలకు మఫ్లర్ చుట్టుకున్నాడు .. అంగీ తొడుక్కున్నాడు—తెల్లవారితే ఉన్న గండాన్ని కడతేర్చడానికి ఏ మిత్రున్నయినా శరణు వేడుదామని ఆ చీకట్లోనే బయటకెళ్ళాడు—

..బ్రతుక నేర్చనోడే బడిపంతులని మమ్మల్నంటారు కాని బ్రతుక లేనోడే బడిపంతులన్నదే నిజం..." తనలో తానే అనుకుంటూ నడుస్తు న్నాడు—

ట్యూషన్లద్వారా వచ్చే డబ్బు కొంత సంతోషాన్నే కలిగినాచినా రావ్‌గారి అప్పు బడిపంతులు గారికి తెల్లవారడం గూర్చి భయపడేలా చేసింది ..

„కొక్కొరోకో " కోడికూసింది—

"శ్రీమన్నారాయణా...వాసుదేవా—ఆపద్బాంధవా- అనాదరక్షకా నీవే దిక్కు—నీవే దిక్కు" అనుకుంటూ లేచి కూర్చున్నాడు శంకరశాస్త్రి అతనికా కోడికూత తనను నిద్రనుండి లేపి భగవంతుని సేవకు తయారు కమ్మనే మేలుకొలుపులా అనిపించింది. చలిగావుంటే మంచంలో వున్న దుప్పట్ని తీసి కప్పుకున్నాడు—

''ఆ దేవదేవుని సేవలోనే జీవితమంతా గడిచిపోతుంది. ఆ కరుణామయుడిదయవల్ల పెద్దగా మిగులకున్నా బట్టపొట్టకు మాత్రం కొరత లేకుండా సాగిపోతుంది—కాని కాలం మారుతుంది దినదినం ఈవృత్తిలో బ్రతకడం కష్టమవుతుంది—పూజారికైవెనుపటి గౌరవమూ లేదు... దక్షిణ ఇవ్వడమూ తప్పదన్నట్లే ఇస్తున్నారు. ఆ ఇచ్చేది ఇప్పటి పరిస్థితిలో చాలడంలేదు—ఈ వృత్తితో బ్రతకడం కష్టమవుతుందనే ఇద్దరు పిల్లల చదివించాను పెద్దాడికి నౌకరయ్యింది...చిన్నవాడింటర్ చదువుతున్నాడు. వాడికి నౌకరయితే కొంత ఊపిరి పీల్చుకోవచ్చు—. ఎంత అప్పు చేయొద్దనుకున్నా ఓడ్డ పెళ్ళికి అల్లుడడిగిన పదివేల కట్నం ఇవ్వడానికిఅప్పుచేయక తప్పలేదు అప్పు చేయకపోతే ఆకట్నం ఇవ్వలేకపోతే మంచి సంబంధం తప్పిపోయేది తెల్లవారి అప్పిచ్చిన రెడ్డి వస్తానన్నాడు. ఇంకొద్ది రోజులాగమంటే ఆగుతాడో-మరేమంటాడో. పెద్దోడ్ని కొంత డబ్బు పంపమని రాయాలి .. ఇంత పొలమయినా అమ్మి రెండు మూడు నెలల్లో అప్పు తీర్చెయ్యాలి. రెడ్డిగారు రేపు పట్టుబడితే మాత్రం పరువుపోతుంది అంతా ఆ దేవుని దయ. రేపు ఆరెడ్డిలో భగవంతుడు ప్రవేశించి నా మానం కాపాడాలి" తనలో తానే అనుకున్నాడు.

"ఇంకొంత సేపు పడుకునేదా? ప్రాత:కాల స్నానం శ్రేష్ఠం— ఎంత చలిగా వుంటే మాత్రమేం? చిన్నప్పట్నుంచీ ఇది అలవాటేనాయె స్నానం ముగించి పొద్దున్నే గుళ్లో పూజ చెయ్యాలి. తర్వాత.. ఇంట్లో తద్దినముంది. అటు తర్వాత సత్యనారాయణ వ్రతముంది ఇవాళ పనులు న్నాయి" అనుకుంటూ దుప్పటితీసి మంచంలో పడేసాడు. అబ్బ చలి పెడుతుంది—అయినా నిండామునిగితే చలెక్కడిది? శరీరంపై ఒక్క చెంబెడు నీళ్ళు పడేంతవరకే చలి" అనుకుంటూ దండెంపైనున్న ఉత్త రీయం కప్పుకొని...ముంతలో నీళ్లు తీసుకొని ప్రథమ కాలకృత్యం తీర్చుకోవడానికి బయటకెళ్ళాడు శాస్త్రి

"కొక్కొరొకో—" కోడికూసింది—

భూస్వామి భూషణ్‌రావు కాకూత శ్రవణపేయంగా వుంది.— ఆతని కళ్ళముందు కనుచూపు మేర వరకున్న భూములు- వైభవం తెల్లవారకముందే పనుల్లో నిమగ్నమయ్యే పాలేర్లు— నౌకర్లు—చాకర్లు— వెట్టివాళ్లు ఇప్పుడన్ని భూముల్లేకున్నా వాటిస్థానంలో పట్నంలో ఆస్తులు న్నాయి—బంగ్లాలున్నాయి— బ్యాంకుల్లో డిపాజిట్లున్నాయి రోజు రోజుకూ పెరుగుతున్న పెట్టుబళ్లున్నాయి — అందుకే అతనికి తెల్లవారడ మంటే సంతోషంగానే వుంది — అయితే అతనికి పాలేర్లు, నౌకర్లు మును పటిలా అణగి-మణగి ఉండటం లేదని ఇచ్చింది తీసుకోవడం లేదని విచారంగా వుంది—కుంచం నిలువునా కొలపడం వీలుకానపుడు బోర్లిం చైనా కొలిస్తే కొంతైనా నిలువగలవని ఆలోచించి వాళ్ళతో ఎలాగోలా పనులు తీసుకుంటున్నాడు... ఇప్పటి పొద్దు పొడవటం మునుపటంత వైభవోపేతంగా లేకున్నా సాగినకాడికి సాగుతూనే వుందని సంతోష పడ్తున్నాడు—" పట్వారీని కట్టుకొని పరంపోగు చెలుకను పదేండ్ల నుంచి తహసీల్ కట్టి పట్టాచేయించుకున్న దాన్ని గురించిప్పుడు జనాలు మర్లబడుతున్నారు—తెల్లవారే మవుతుందో,, ఇదీ తెల్లవారితే భూషణ్

రావుకున్న సమస్య..."పొద్దున చూసుకోవచ్చులే.. అనుకుంటూ లేచి ఇంటిముందు పడుకున్న పెద్ద పాలేర్ని లేపి పనులు పురమాయించి... నిద్రలో కొరిగాడు భూషణ్ రావు....

ఎన్ని ఆస్తిపాస్తు లున్నా భూషణ్ రావుకూ ప్రొద్దుపొదుపు కొంత సమస్యాత్మకంగానే వుంది...

..కొక్కొరోకో... కోడికూసింది....

ఆ ధ్వని బుచ్చయ్య షావుకారికి వీనుల విందుగా వుంది— చిట్టి కుండంతటి బొర్రను నిమురుకుంటూ లేచాడు — మంచం ప్రక్కనే వున్న త్రిజోదీని తడిమిచూసాడు. పూజాగదిలో కెళ్ళి లక్ష్మిదేవి ఫోటోకు దండం పెట్టొచ్చాడు. ముసుగ్గప్పుకొని పడుకున్నాడు.

..తెల్లారితె పంతులిచ్చె బాకి వసూల్జెయ్యాలె— ఈసారసలే ఊకో వద్దు, వడ్ల బ్రహ్మయ్యం బాకి గట్టే వాయిదా గూడియ్యాల్లనే— ఆడు కొంత వడ్డీ మాపు చెయ్యమనడుగుతడు గావచ్చు ... సచ్చినా ఒక్క పైసన్న తక్కొ సెయ్యద్దు...గట్ల జేసినంక నేనెక్కడ పైకత్త ? తెనుగు ఎల్లయ్య బిడ్డ లగ్గానికి తీసుకున్న రెండువేలు-ఐదువేలయింది... తెల్లారి కడుతనన్నడు. మూడులెక్క మిత్తి గడ్త నంటండు గని నాల్గు లెక్క వసూల్జేసుడే అప్పులిచ్చిన కాడ కనికరం జూపితె సేతికి సిప్ప లత్తయి" రేపు చెల్లించబోయే అప్పు డబ్బుల గూర్చితనలోతానే లెక్క లేసుకున్నాడు. లక్ష రూపాయలకు పైగా నెలకు ఒక్క రూపాయికి నాలుగు పైసలవంతున్న వడ్డీకి తింపుతున్న బుచ్చయ్య షావుకారికి ఒక్క రోజు గడిచిందంటే దాదాపు 1ు /– రూపాయలు కేవలం వడ్డీల రూపంలోనే వస్తాయి—అందుకే అతనికి సంతోషంగా వుంది . కాని తెల్లవారితే .. చెల్లించవలసిన వాటిలో కాపు కొండయ్య బాకీ మాత్రమాతనికి సమ స్యాత్మకంగా అగుపిస్తుంది – దాన్ని వసూలు చేయడం కష్టంగానే తోస్తుందతనికి —

"బాకి గట్టుమంటేనే మీదిమీది కురికత్తాండు—ఇదువరగట్టినయే ఎక్కో పొమ్మంటండు. అని బాకెట్ల వసూజెయ్యాన్నో తెలుత్త లేదు.... కోర్టుకు పోదామంటే నాది లైసన్సు లేకుంటచ్చిన బాకాయె—పెద్ద మనుషులతోటి అడిగిపిత్తనన్న కని ఏమైతదో ఏమొ" రేప్రొద్దున్న వసూలు చేసే బాకిల్లో కాపు కొండయ్య బాకి గూర్చి ఆందోళన చెందుతున్నాడు బుచ్చయ్య— సరె రేప్పొద్దుగాల సూసుకోవచ్చు— తెల్లారుతంది.— లేవన్నా? లేసి పేసేదేముంది? కొంచెం పొద్దెక్కినంక లేత్త. అనుకొని ముసుగు తన్నుకొని లోపల్లోపల అంజనేయ దండకం పఠిస్తూ నిద్రలో కొరిగాడు బుచ్చయ్య

„కొక్కొరోకో „ కోడికూసింది ...

పెగ్గులేసుకొని రగ్గుకప్పుకొని పెచ్చగా పడుకున్న పారిశ్రామిక వేత్త రాజారావుకు మెలకువొచ్చింది కండ్లు నులుముకున్నాడు. అతని కళ్ళముందు కోట్ల ఆస్తులు—ఏ,సి. బంగ్లాలు-ఫ్యాక్టరీ కదులుతున్నాయి. కోట్లు సంపాదించినా అతడింకా సంపాదిస్తూనే వున్నాడు. కొత్త రోజు రావడమంటే తన ఆస్తికి మరికొంత కలువడమనే రాజారావు నిర్వచనం. అందుకే అతనికి కోడికూత-పొద్దుపొడుపు ఆహ్లాదకరంగానే వుంటుంది. అయితే కోట్ల ఆస్తిపాస్తులున్నా అతనికీ కొన్ని సమస్యలున్నాయి—

"ఫ్యాక్టరీ వర్కర్స్ జీతాలు పెంచాలని సమ్మె నోటీసిచ్చారు—పదేళ్ళుగా వాళ్ళ జీతాలు పైసా పెరుగలేదు — వాళ్ళు పెంచమనడము న్యాయమే కావచ్చు...కాని ఎందరో కడుపులు కొట్టందే ఏ పారిశ్రామిక వేత్తా పైకిరాడు వాళ్ళ వల్లనే నా ఆస్తులు కోట్లు పెరిగాయన్నదీ నిజం' అయినా డబ్బు సంపాదన విషయములో సెంటిమెట్లు పనికిరావు. అయితే సమ్మెకాకుండా ఎలా నిరోధించాలి? వాళ్ళ నాయకుడికి లంచ మిచ్చి లొంగదీసుకుంటే? కార్మికులైకమత్యంగా వున్నారు— అతడు లొంగగలడా? ఒకవేళ అతడు లొంగకపోతే సమస్యే'' ఆ సమ్మెనెలా

అణచాలని రకరకాలుగా ఆలోచిస్తున్నాడు రాజారావు. తెల్లవారింతర్వాత చూడొచ్చులే అనుకుంటూ రగ్గు కింద పడుకున్నాడు రాజారావు...

కోట్ల ఆస్తులున్న రాజారావుకు ఆ ఆస్తులు పెంచిన కార్మికులు కడుపు నిండక జీతం పెంచుమంటే— దాన్నణచడమో సమస్యయి పొద్దుపొడవడం కొంత ఆందోళనకరంగా అగుపడుతుంది

కోడికూస్తున్న ఒకే కూత రెక్కలు ముక్కలు చేసుకున్నా— డొక్కలు నిండక అట్టడుగు జనానికి భయంకరంగానూ —రొటీన్ బ్రతుకు బ్రతుకుతూ త్రిశంకు స్వర్గంలో వేలాడుతున్న మధ్యతరగతి జనానికి ఏ భావమూ కల్గించనిదిగానూ అన్నీ వున్న ధనిక కుటుంబాలకు ఆహ్లాదం కల్గించేదిగానూ వుంది అయితే వీళ్ళందరూ ఎవరికివారే పొద్దుపొడుపుతో తమకు సమస్యలున్నట్టుగా భావిస్తున్నారు... అయితే పుల్లయ్య లాంటి వాళ్ళవీ, సాయిరెడ్డిలాంటి వాళ్ళవీ. భూషణ్‌రావులాంటి వాళ్ళవన్నీ సమస్యలేనా? తిండి దొరక్క పోవడమూ, తిన్నదరక్క పోవడమూ సమస్యలే అయితే వాళ్ళందరివీ సమస్యలే —

ఎవరివి సమస్యలయినా కాకపోయినా, తన కూత ఎవరికే భావం కల్గిస్తున్నా తనకేం సంబంధం లేనట్టు కోడి మాత్రం తన విధిని నిర్వహిస్తూ రోజూ తెల్లవారు జామున కొక్కొరోకో అని కూస్తూనేవుంది...

అందరికీ శ్రవణపేయంగా వుండే కోడికూత-సమస్యలే వుండని పొద్దుపొడుపు ఎంత దూరంలో వుందో—?

14. 4. 91

'జనధర్మ' వారపత్రిక మే 1988